# పాపఫలం

'కళ్ళులేని కబోదిని అమ్మా, పిడికెడు బిచ్చమేయండమ్మా' అంటూ ముష్టివాడు బయటనుంచి మామూలు ధోరణిలో అరిచాడు, పొట్ట చేతినిపట్టుకుని.

'పో అవతలకు పో, తెల్లారకుండానే ముష్టి! కళ్ళు ఉండికూడా లేకుండా చేసుకునే ఖర్మమేం కాలింది ముష్టిగింజల కోసం!' అంటూ కసిరాడు శేఖరం.

'కళ్ళుఉంటే ఈ ముష్టి కర్మమేం బాబయ్యా' అంటూ నీల్గాడు ముష్టివాడు.

'దయచేయ్యవోయి, నాకు శ్రీరంగనీతులు చెప్పక్కర్లేదు' అంటూ ముష్టివాడిపై అరుస్తూ కరిచేటంత పనిచేశాడు శేఖరం. ముష్టిసంగతి మరచి శేఖరంచేసే హడావిడి విని, భయమేసి పరుగెత్తాడు ముష్టివాడు, పక్కనఉన్న కుర్రవాడి ఆసరాతో.

'ముష్టివాళ్ళందరికీ యిదొక అలవాటైపోయింది. తాటికాయంత కళ్ళుపెట్టుకునికూడా గుడ్డితనం నటించడం ఎందుకు? దొంగపీనుగులు! యీ గుడ్డివాళ్ళతో బాధ మాచెడ్డ కష్టంగా వుంది' అంటూ గొణుక్కున్నాడు శేఖరం, ముష్టివాడు వె పోయాక.

'ఒరే శేఖరం, ఆ పలుదోము పుల్ల యిలా తెచ్చి పెడుదూ' అన్నాడు శేఖరం తండ్రి పొద్దున్నే లేస్తూ పళ్ళు తోముకుందామని.

'తెల్లారిందో లేదో మొదలెట్టాడు యీ గుడ్డిముండా వాడు! యీ గుడ్డివాళ్ళకి చాకిరీ చెయ్యలేక చస్తున్నాను బాబూ...మీరు కూర్చున్నచోటినుంచి ఎలాగా కదల్లేరు. అంత కంగారెందుకూ! ఆపలుదోముపుల్ల అమ్మ తెచ్చి యిస్తుంది. కాసేపుఉండండి!' అని గదిమాడు శేఖరం తండ్రిని అతని తల్లి యీ మాటలువిని తక్షణం పలుదోముపుల్ల తెచ్చియిచ్చింది రామనాథంగారికి.

'చీటికిమాటికి, అలా చంటిపిల్లవాణ్ణి గదిమినట్లు కసురుతావేమిటి? ముసలివాళ్ళయేక కాస్త కన్ను కనిపించక పోవడం ప్రతివాళ్ళకూ పరిపాటే. కొంచెం జాగ్రత్తగా మాట్లాడ్డం మంచిది' అంటూ కేకవేసింది తల్లి, శేఖరం నిత్యమూ తండ్రిని గదమడం భరించలేక. 'సరే, నువ్వు నాకు నీతులు చెప్పనక్కర్లేదు' అంటూ శేఖరం రుసరుసలాడుతూ బయటికి పోయాడు

శేఖరంకి గుడ్డివాళ్ళని చూస్తే ఒళ్ళు మండిపోతుంది. తన్ను పీడించి బాధ పెట్టడానికే యీ గుడ్డివాళ్ళు పుడుతున్నారా అనిపించింది. తండ్రికి ముసలితనం వచ్చాక కండ్లు నికపించటంలేదు. కంట్లో ఏవో పొరలు, పువ్వులు వేశాయి. ఏమీ కనిపించవని అంటాడు తండ్రి. ఇదో దొంగనాటకం! చాకిరీ

చేసేవాళ్ళు యెదురుగుండా కనిపిస్తోంటే యెంత గుడ్డితనమేనా నటించవచ్చు. తండ్రికి యీ కంటిజబ్బు రావడంవల్ల ప్రతివిష యమూ తనే చూచుకోవలసి వస్తోంది. ఒక ఉత్తరంవస్తే తనే చదవాలి. అటుపుల్ల యిటుపెట్టాలంటే 'శేఖరం' అని పిలు స్తాడు తండ్రి. చిన్నప్పుడల్లా కూరగాయలు తెమ్మని, ఈపని ఆ పని చేయమని తెగవేధించుకు తినేవాడు. యింత చాకిరీ చేయించుకుని, పైగా నా అనుభవంకోసం నేర్పుతున్నాననే వాడు. ముసలిపీనుగులైనాక ఒకమూలపడి వుండక, యింకా యీ అదుపులు, ఈ ఆజ్ఞలు ఏమిటి? ఎప్పుడూ పెద్దవాళ్ళ చాకిరీతో జీవితం గడిచిపోతుంటే, జీవితంలో సుఖం ఎప్పుడు అనుభవించేది? పెళ్ళాం కాపురానికి వచ్చింది. హాయిగా సుఖంగా బ్రతకాలనుకుంటే ఈ యింటి చాకిరీలు పీల్చి పిప్పి చేస్తున్నాయి.

దొరల బ్రతుకు నయం. పెళ్ళికాగానే భార్యాభర్తలు హాయిగా కొన్నాళ్ళు దేశాటనచేసి సుఖపడతారు - మనకా యోగం లేదు. నిత్యమూ చాకిరీ చెయ్యమంటే పాపం! దానికి మాత్రం బాధకాదూ! ఆ మాత్రం కొడుకూ కోడళ్ళని సుఖ పెట్టలేకపోతే పెళ్ళెందుకు చెయ్యాలి తనకు? యీ చాకిరీ అంతా తండ్రి గుడ్డిపీనుగు అవటంవల్ల తన నెత్తిన పడుతోంది. ఎవరి ఖర్మం వాళ్ళది. పిలిచినా వినిపించుకోకుండావుంటే, వాళ్ళ విషయాలు వాళ్ళే యేడుస్తారు—అంటూ చీదరించుకున్నాడు శేఖరం—కాఫీహోటల్లో కూర్చుని ఫలహారంచేస్తూ. ఫలహార

మయినాక ఆఫీసు టైంఅయిందని బయలుదేరి యింటికి వచ్చాడు.

'ఒరే శేఖరం! అమ్మాలుకు కొంచెం కళ్ళకలకగా వుంది, ఆ ప్రక్కనవున్న మెనాన్ డాక్టరుగారి దగ్గరకు తీసుకువెళ్ళి కొంచెం మందు వేయించుదూ' అంది శేఖరం తల్లి,—అతను యింటిరాగానే.

'నాకు ఆఫీసు టైం అయింది, నేను పోవటానికి వీలు గాదు. కావలిస్తే నువ్వే తీసుకెళ్ళు అమ్మాలుని ఆసుపత్రికి' అంటూ ఖచ్చితంగా చెప్పేశాడు శేఖరం.

'అవును నాయనా ఇంకా యీ ముసలితనంలో ఆసుపత్రులకు, బజారులకుకూడా నేనే తిరగాలేమో' అంటూ బాధ పడింది తల్లి.

'కళ్ళు కలిగి, దారి కనిపించకపోతే చెయ్యిపట్టుకుని ఆసుపత్రిదాకా ఎవరు తీసుకెళ్ళగలరు దానిని? ఎవరి ఖర్మ వాళ్ళది. ఎవరి బాధలు వారు పడాలి. వీళ్ళందరికి గుడ్డితనం నన్ను పీడించుకు తిండానికి వస్తున్నట్లుంది' అంటూ చిందులు త్రొక్కాడు, చెల్లెలి కళ్ళకలక గురించి.

చిన్నప్పటినుంచి ఎంతో గారాబంగా పెంచి పెద్దజేస్తే, తనకు ముసలితనంవచ్చాక, బ్రతుకు గుడ్డిదై పోతే, యింతగా యీసడిస్తున్నాడే! తననే కాకుండా యింట్లోవాళ్ళందరినీ కసురుతున్నాడు! అంటూ లోలోపల బాధపడ్డాడు రామనాథంగారు.

'కోడలు కాపురానికి వచ్చాక వాడిమనస్సు మారిపోయింది' అంటూ విచారించేది శేఖరం తల్లి.

తండ్రిని చూచినకొలదీ శేఖరానికి చికాకు ఎక్కువ కాసాగింది.

శేఖరం! పోనీ కంటి ఆపరేషను చేయించుకుంటే కళ్ళు బాగుపడతాయేమో' అన్నారు రామనాథంగారు. తన కళ్ళు బాగుపడితే తక్కినవాళ్ళకు చాకిరీ బాధ తగ్గుతుందనే ఆశతో,

'నాకు తెలియదు. మీ అవస్థలు మీరు పడండి, కావాలంటే డబ్బు పారేస్తాను' కోపం చిందుకుంటూ గర్జించాడు శేఖరం.

కొడుకు కోపం, చికాకుచూసి తల్లికి ఒళ్ళు మండింది, 'ఆ పారేసేడబ్బు యిలాపారేస్తే మా తంటాలు మేము పడతాం' అని ఎదురు తిరిగింది. శేఖరం డబ్బువిసిరి వెళ్ళిపోయాడు.

రామనాథంగారికి కంటి ఆపరేషను జరిగింది. కళ్లు బాగుపడి మొదట్లో కొంచెం సుఖువుగానేవుంది. రామనాథంగారనుకున్నారు—దీనితో యింట్లో ఉన్నవాళ్ళందరి కష్టాలు గట్టెక్కుతాయని! కాని త్వరలోనే జ్వరంవచ్చి ఆ జ్వరం విషజ్వరంగా పరిణమించి, రామనాథంగారిని పొట్టనుపెట్టుకుంది. శేఖరం యథావిధిగా అంత్యక్రియల విధ్యుక్తధర్మం నిర్వర్తించాడు.

'పాపం! మీ నాన్నగారు యింతలో చనిపోతారని అనుకోలేదు. ఆపరేషను చేయించుకోకుండా ఉన్నా, మనలిని పీడించుకు తిండానికి యింకా బ్రతికేవారేమో' అంది శేఖరం భార్య వెటకారంగా, రాత్రి పడకగదిలో.

'పోనీలెద్దూ ముసలాళ్ళయినాక త్వరగా చస్తేమంచిది. పైగా గుర్రిడ్డి, చెముడుతో పీడించి ఏడ్పించే ముసలాళ్ళు ఎంత త్వరగాపోతే అంత శ్రేయస్కరం' అన్నాడు శేఖరం—జీవితంలో ఏదో క్రొత్తసూత్రం కనుక్కొన్నట్టు సగర్వంగా.

'మనిద్దరికీ పీడ పదిలింది' అంటూ నవ్వుకున్నారు ఆ భార్యా భర్తలు.

... ... ...

ఆరునెలలు గడిచాయి. ఊళ్ళో మశూచికం వ్యాపించి, ఎంతోమంది ప్రజల్ని ఆవేశించి బలిగొంది. ప్రజలలో అలజడి, హాహాకారాలు రేకెత్తాయి.

ఊళ్ళో అడుగుపెట్టిన మశూచికం శేఖరాన్నికూడా ఆవేశించింది. ఒంటినిండా నల్లటి పొక్కులు బయలుదేరి సలపడం వల్ల, మరణబాధ పడుతున్నాడు శేఖరం. అతని తల్లి శేఖరాన్ని జాగ్రత్తగా కనిపెట్టి చూస్తూ చాకిరీ చేస్తోంది. భర్త పోయినందుకు విచారంతో కుంగి బాధపడుతూంటే, యీ మశూచివ్యాధి తన కుమారునికి ఏ ఆపత్తు కలిగిస్తుంతో అని ఆమె లోలోపల దుఃఖించసాగింది.

నఖశిఖపర్యంతము వేసిన నల్లటి మశూచి పొక్కులు పాతకల్లా ఎదిగి, ఒకనాడు హఠాత్తుగా చితికాయి. శేఖరం కెవ్వుమని అరిచాడు. కళ్ళల్లో ఏవో పురుగులు తొలిచినట్లనిపించింది అతనికి. ఆ బాధ పడలేక గొల్లున పిల్లవాడిలా ఏడ్వ మొదలుపెట్టాడు.

తల్లి చేసిన ఉపచారాలు, వాడిన నాటువైద్యం శేఖరాన్ని ప్రాణంతో నిలబెట్టాయి. మశూచి పూర్తిగా తగ్గింది. కాని కళ్లుమాత్రం పోయాయి. ముఖంనిండా తిరగలి గంటుల్లా పెద్ద పెద్ద లోతుల మచ్చలు ఆవరించి, అతని ముఖాన్ని అందవికారం చేశాయి.

ఇంత అకస్మాత్తుగా విధి మారడం శేఖరానికి చాలా అద్భుతంగా తోచింది. గుడ్డి ముష్టివాళ్ళను, కళ్లు కనిపించని తండ్రిని విసుక్కుని కసిరి, రుసరుసలాడిన తనకు దైవము అంధత్వము సంప్రాప్తింప జేశాడని కుమిలికుమిలి ఏడ్చాడు. ఒకప్పుడు తనంటే ఎంతో ప్రేమ, అభిమానం చూపించిన భార్య తన్ను చూసి ఏవగించుకుంటోంది. ఒకసారైనా దగ్గరికి రావటంలేదు.

దానికోసమేకదా నాన్నని, అమ్మని కూకలేసేవాడిని. ఆమాత్రం విశ్వాసమన్నాలేదు దానికి. ఏదైనా అవసరమని పిలుస్తే, అమ్మలుని పంపి పనిచేయిస్తోంది. లేకపోతే అమ్మవచ్చి చేసి వెళ్ళిపోతోంది, అడిగినవన్నీ తెచ్చియిచ్చి, ఆదరించగలశక్తి ఉన్నప్పుడే భార్యలు భర్తలకు అనుకూలంగా ఉంటారు కాని విధి పరిస్థితులను తలక్రిందులుచేస్తే, ఆ అభిమాన భార్యలే రక్కసులుగా మారిపోతారు అంటూ మధనపడ్డాడు శేఖరం.

తన మేనమామగారింట్లో పెండ్లికని వెళ్ళిన శేఖరం భార్య, ఎన్ని కబుర్లుపంపినా, తిరిగిరాలేదు. యింక రాదనికూడా శేఖరం స్థిరపరుచుకున్నాడు. అవును ఎందుకు వస్తుంది? తనవంటి గుడ్డివాడిదో ఎందుకు కాపురం చేస్తుంది!

తండ్రికి ముసలితనంలో కళ్లు కనిపించనిమాత్రాన తాను చూపిన పత్రివ్రతన అతని హృదయాన్ని తొలిచి కలచింది. పశ్చాత్తాపంతో కుంగిపోయాడు. అమ్మని ఏన్నో మాటలన్నా యిప్పటికీ ఎంతో అభిమానంగా, ఆదరణతో, ముసలిదైనా, ఎంతో చాకిరీ చేస్తోంది తనకు. అమ్మలుని ఎన్నిసార్లు తిట్టినా, తనంటే ఎంతో అభిమానం దానికి. తనకళ్లు పోయాయని, బిల బిలా విలపిస్తుంది.

కుంగిపోయి మథనపడుతున్న హృదయంతో తల్లిని పిలిచాడు శేఖరం.

'అమ్మా !'

'ఏం నాయనా !'

'దాని దగ్గర్నుంచి ఏమీ ఉత్తరాలు లేవా ?'

'కోడలు దగ్గరనుంచా ?...లేవు.'

'ఇక ఎందుకు వస్తుంది ఇక్కడకు.'

'విచారిస్తే ప్రయోజనం ఏముంది ?'

'యీ గుడ్డితనం భరించలేనమ్మా.'

(శేఖరం తల్లి శోకంతో కన్నీరు తుడుచుకుంది.)

'యీ గుడ్డితనంవల్ల పూర్తిగా అప్రయోజకుడనై పోయాను.'

'అలా అనకు నాయనా !'

'నాన్నను మునుపు అన్న మాటలకు ఆయన ఎంత బాధపడి వుంటారో.'

'.........'

'మిమ్మల్ని అనరాని మాటలన్నానమ్మా! అన్నమాటలకు పాపఫలం అనుభవించవలసి వస్తోంది. నన్ను క్షమించు అమ్మా!'

'అలా విచారించకు బాబూ! అయిపోయిందేదో అయిపోయింది.'

'అంతే, అంతే' అంటూ వెక్కి-వెక్కి ఏడ్వసాగాడు శేఖరం. తన్ను ఎప్పుడూ ఆవరించి ఆదరిస్తూన్న అంధకారం, ప్రక్కనున్న తల్లి అతన్ని ఓదార్చాయి.

'కళ్లులేని కబోదిని అమ్మా బిచ్చమేయండమ్మా' అంటూ బిచ్చగాడు మూల్గాడు వీధిలోంచి.

'వాడికి కొంచెం ముష్టివేసి పంపించు అమ్మా! నాలా వాడు ఎంత బాధపడుతున్నాడో.' శేఖరం గుడ్డికళ్ళనుంచి రెండు వేడినీటి చుక్కలు అతని తల్లి చేతుల్లో రాలాయి. ఆ కన్నీటి కల్మషాన్ని ముష్టివాడికి వేసే గింజలతో తుడిచివేసింది అతనితల్లి.